
సాక్షి తిరుపతి

శుక్రవారం । 30 । ఆగస్టు । 2024



బస్సు బోల్తా : ఏడుగురికి గాయాలు

పల్లె వెలుగు బస్సు అదుపుతప్పి బోల్తాపడి ఏడుగురికి గాయాలైన సంఘటన చిల్లకూరు మండలంలో చోటుచేసుకుంది. - 8లో



భక్తులకు లడ్డూ 'పోటు'

తిరుమలలో శ్రీవారి లడ్డూ ప్రసాదం పంపిణీపై టీటీడీ ఆంక్షలు విధించడంతో భక్తులు తీవ్రనిరాశతో వెనుదిరిగారు. - 8లో



కష్టపడితేనే రాణిస్తారు

యువన్యాయవాదులు కష్టపడితేనే వృత్తిలో రాణిస్తారని డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పసల పొన్నారావు పేర్కొన్నారు. - 8లో

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమల క్యూ కాంప్లెక్స్‌లో 19 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 76,772 మంది స్వామివారిని దర్శించుకోగా 30,293 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.82 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

రేపు ఉదయం నుంచి పింఛన్ల పంపిణీ



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: సామాజిక భద్రతా పింఛన్లు ఈ నెల 31వ తేదీ (శనివారం) ఉదయం 6 గంటల నుంచి పంపిణీ చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ఆయన గురువారం కలెక్టరేట్ నుంచి జిల్లాలోని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, సచివాలయ ఉద్యోగులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 1వ తేదీ ఆదివారం సెలవు రోజు కావడంతో, ఆగస్టు 31వ తేదీ శనివారమే పింఛన్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. గత నెలలో పింఛన్ల పంపిణీ విషయంలో ఆలస్యంగా చేసిన వారికి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని వెల్లడించారు. ఎక్కడపడితే అక్కడ ఇవ్వకుండా పింఛన్‌దారుల ఇంటి వద్దకే సచివాలయ ఉద్యోగులు వెళ్లి ఇవ్వాలని వివరించారు. శుక్రవారం బ్యాంకు వద్దకు వెళ్లి పింఛన్ నగదును డ్రా చేసుకోవాలని, శనివారం సాయంత్రానికి వందశాతం పంపిణీ చేయడానికి కృషి చేయాలని స్పష్టం చేశారు. మిగిలిన పోయిన వారికి సెప్టెంబర్ 2వ తేదీ పంపిణీ చేయాలని వివరించారు. ప్రతి నెలా సామాజిక భద్రతా పింఛన్లలో ప్రభుత్వం కోత విధిస్తోంది. రెండు నెలల్లో 2,073 పింఛన్లు తొలగించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ప్రభావతి, సచివాలయ విభాగం జిల్లా అధికారి సుశీలాదేవి, లీడ్ బ్యాంక్ మేనేజర్ విశ్వనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్వీయూలో పెన్షనర్లకు ప్రత్యేక పోర్టల్



పెన్షనర్ల ప్రత్యేక పోర్టల్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి సిటీ: ఎస్వీయూలోని పెన్షనర్ల కోసం ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రారంభించినట్లు వీసీ డాక్టర్ సీహెచ్ అప్పారావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన వీసీ చాంబర్‌లో రిజిస్ట్రార్ భూపతినాయుడు, వర్సిటీ అధికారులతో కలసి ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రారంభిచారు. ఆయన మాట్లాడుతూ కొత్త పోర్టల్ టీచింగ్, నాన్ టీచింగ్ పెన్షనర్లకు ఎంతో ఉపయోగకరమని, పెన్షన్ త్వరితగతిన అందించడానికి, సమస్యల పరిష్కారానికి, వారి ఆర్థిక లావాదేవీలు ఎప్పటికప్పుడు ఇంటి నుంచే తెలుసుకునే వీలుంటుందన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిటైర్డ్ టీచింగ్, నాన్‌టీచింగ్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

భాషా పండితులకు సన్మానం



భాషాపండితులను సత్కరిస్తున్న కలెక్టర్, జేసీ, డీఆర్వో

తిరుపతి అర్బన్: తెలుగు భాషాభివృద్ధికి గిడుగు వెంకటరామమూర్తి సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో పలువురు తెలుగు భాషా పండితులను సత్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ తెలుగు భాష విస్తరించడానికి గిడుగు చేపట్టిన పలు కార్యక్రమాలను వివరించారు. 1863లో శ్రీకాకుళం జిల్లా పర్వతాల పేట గ్రామంలో జన్మించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో పెంచల కిషోర్, సమాచారశాఖ జిల్లా అధికారి బాలకొండయ్య, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

భద్రత ఉంటేనే సరైన సేవలు



ప్రభుత్వ ఆస్పత్రుల్లో తగిన భద్రత ఉంటేనే మహిళా వైద్యులు సరైన సేవలు అందించగలరు. ప్రభుత్వాలు కఠినమైన నిబంధనలు తీసుకురావాలి. మంచి వాతావరణం ఉంటే రోగులకు నాణ్యమైన వైద్యాన్ని సకాలంలో అందించేందుకు అవకాశం ఉంటుంది. వార్డుల్లో పోలీసు భద్రతా సిబ్బందిని పెంచాలి. మహిళా వైద్యులు శారీరకంగా, మానసికంగా దృఢత్వంతో ఉండేలా చర్యలు చేపట్టాలి.

– డాక్టర్ మురహరి, తిరుపతి



పటిష్ట భద్రత అవసరం




ప్రభుత్వ ఆస్పత్రుల్లో మహిళా వైద్యుల కోసం కఠినమైన చట్టాలు తీసుకురావాలి. వచ్చే శీతాకాల సమావేశాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదిశగా చర్యలు తీసుకోవాలి. చట్టాలు, నిబంధనలపై స్పష్టమైన ఆదేశాలు ఉండాలి. మాటల్లో కాకుండా నిర్మల్ చట్టాలపై భద్రతను చూపాలి. ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి వసతి గృహాలకు వెళ్లే ప్రాంతాల్లో పటిష్టమైన భద్రత, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.

– డాక్టర్ మౌనిక రెడ్డి, తిరుపతి

పేరు రూపలత. విద్యుత్ శాఖలో ఏఈగా ఉద్యోగంలో చేరారు. ఏఈ, డీఈ, ఈఈగా పదోన్నతులు పొందారు. ప్రస్తుతం తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో ఐపీసీ సెక్షన్‌లో ఈఈగా పనిచేస్తున్నారు. గత 31 ఏళ్లుగా తిరుపతిలోనే విధులు నిర్వర్తిస్తున్నారు. కనీసం పక్కన ఉన్న ప్రాంతానికి కూడా బదిలీ కాలేదు. 30 సంవత్సరాల 10 నెలల 17 రోజుల పాటు తిరుపతిలోనే ఉన్నారు. బదిలీల ప్రక్రియ మొదలైన ప్రతి సారీ ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారిని తప్పనిసరిగా బదిలీ చేయాలనే నిబంధన ఉంటుంది. కానీ ఇలాంటి వారు నిబంధనలకు అతీతంగా బాధ్యతలు నిర్వర్తిస్తుంటారు.

పేరు జానకిరామ్. తిరుపతిలోని కార్పొరేట్ కార్యాలయంలో ప్రస్తుతం జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. 14 ఏళ్లుగా తిరుపతిలోనే ఏఈగా, డీఈగా, ఈఈ గా పనిచేశారు. ఈయన అంతే తిరుపతి సర్కిల్, లేదంటే తిరుపతి కార్పొరేట్ కార్యాలయం. ఇలా తిరుపతిలోనే తిష్ట వేసేశారు. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా పట్టింపు ఈయన సీటు మాత్రం పటిష్టం.

నీలం నరేంద్రనాథ్, వాసుదేవరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు.. వీరంతా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు. గత 15 ఏళ్లుగా వీరంతా తిరుపతినే పట్టుకుని వేలాడుతున్నారు. వీరిని కూడా బదిలీల నుంచి కాసుల హారం కాపాడుతోంది. వీరే కాదు డీఈ క్యాడర్‌లో పనిచేస్తున్న సుజాత 19 ఏళ్లుగా తిరుపతిలోనే ఉంటే, జగదీశ్వర్‌రెడ్డి 18 ఏళ్లుగా కర్నూలులోనూ, ప్రసన్నకుమారి 16 ఏళ్లుగా, వాసవీ లత 15 ఏళ్లుగా తిరుపతిలోనే ఉండిపోయారు. ఇలా...చెప్పుకుంటూ పోతే విద్యుత్ శాఖలో నిబంధనలకు విరుద్ధంగా బదిలీల నుంచి తప్పించుకున్న వారు పదుల సంఖ్యలోనే ఉన్నారు.



తిరుపతి ఎస్‌ఈని కదిలించే సత్తా ఉందా?

తప్పనిసరిగా బదిలీ చేసే అధికారుల జాబితాలో తిరుపతి సర్కిల్ ఎస్‌ఈ సురేంద్రనాయుడు సైతం ఉండడంతో ఆయన బదిలీ తప్పదా? అంటూ ఉద్యోగుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తిరుపతిలోనే ఆయన ఐదేళ్లకు పైగా పనిచేస్తున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నాటి ఎస్‌ఈ కృష్ణారెడ్డిని బలవంతంగా సెలవులోకి పంపించి కార్పొరేట్ కార్యాలయంలో జీఎంగా ఉన్న చంద్రగిరి మండలానికి చెందిన సురేంద్రనాయుడును దొడ్డిదారిలో ఎస్‌ఈగా నియమించారు. 20 రోజుల తర్వాత కృష్ణారెడ్డికి కార్పొరేట్ కార్యాలయంలో జీఎంగా పోస్టింగ్ ఇవ్వడం గమనార్హం. ప్రస్తుతం బదిలీల జాబితాలోకి రావడంతో సురేంద్రనాయుడు ఎస్‌ఈ పోస్టు మున్నాళ్ల ముచ్చటగానే మారనుంది. నిబంధనలు తమకు పట్టవని, అధికార పెద్దల అండ ఉందని, బదిలీ జాబితాలో ఉన్న కూడా సీఎండీపై ఒత్తిడి తెచ్చి మరీ ఎస్‌ఈగా కొనసాగుతారని సురేంద్రనాయుడు అనుచరులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

కదలరు.. వదలరు

- మమ్మల్ని ఎవరూ కదిలించలేరు
- విద్యుత్ శాఖలో తిష్టేసిన ఉద్యోగులు
- దశాబ్దాలుగా ఒకే ప్రాంతంలో విధులు
- ప్రభుత్వాలు మారినా వారు మాత్రం మారరు
- చక్రం తిప్పుతున్న ఒకరోజు ఎస్‌ఈ



తిరుపతి రూరల్: దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఎస్పీడీసీఎల్) పరిధిలో కొందరు అధికారులు, ఉద్యోగులు బదిలీ ప్రక్రియను వెక్కిరిస్తున్నారు. బదిలీల కోసం ప్రభుత్వం పక్కాగా విడుదల చేసిన నిబంధనలను సైతం తుంగలో తొక్కి ఏళ్ల తరబడి ఒకే ప్రాంతంలో తిష్ట వేసుకుని కూర్చుంటున్నారు. కొందరు రాజకీయనేతలకు గులాంగిరి చేస్తుంటే, మరికొందరు కాసులను ఎరగా వేస్తున్నారు. ఇంకొందరు స్పౌజ్ కోటాను అక్రమంగా వాడేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా తిష్ట వేసిన వీరిని కదిలించేందుకు సీఎండీ స్థాయి అధికారులు ప్రయత్నించినా, వారు లెక్కచేయకుండా అదే ప్రాంతంలో కొనసాగుతూ అధికారులకే సవాల్ విసురుతున్నారు.

జాబితాను విడుదల చేసిన సీఎండీ

ఎస్పీడీసీఎల్ పరిధిలో ఉద్యోగుల బదిలీకి సంబంధించి ఒకే ప్రాంతంలో ఏ క్యాడర్‌లో అయిన పని చేస్తూ ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారిని తప్పనిసరిగా బదిలీ చేయాలని ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ విజయానంద్ ఆదేశాలు జారీ చేశారు. డిస్కం పరిధిలో బదిలీకి అర్హులు అంటూ బుధవారం రాత్రి సీఎండీ సంతోషరావు జాబితాను విడుదల చేశారు. చీఫ్ ఇంజనీర్లు, చీఫ్ జనరల్ మేనేజర్లు నుంచి ఏఈ, ఏఈఓ క్యాడర్ వరకు జులై 31 నాటికి ఐదేళ్లు పూర్తి చేసుకుని ఒక్క రోజు దాటిన వారిని జాబితాలో చేర్చారు. ఈఈగా పనిచేస్తున్న రూపలత తిరుపతిలోనే 31 ఏళ్లుగా పనిచేస్తున్నట్లు ఉండడంపై అందరూ ఆశ్చర్యపోయారు. చాలా మంది ఈఈ లు, డీఈలు, ఏఈలు సైతం 10 నుంచి 30 ఏళ్లుగా ఒకే ప్రాంతంలో ఉండడం గమనార్హం.

తాజాగా విద్యుత్ శాఖలో ఐదేళ్లు ఒకే ప్రాంతంలో పని చేసిన వారిని తప్పనిసరిగా బదిలీ చేయాలనే నిబంధన విధించడం, ఏళ్ల తరబడి తిష్ట వేసిన వారి జాబితాను బహిరంగ పరచడంతో ఈసారైనా వారిని కదిలిస్తారా? అని పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది.

స్పౌజ్ కోటాను దుర్వినియోగం చేస్తున్నారు

బదిలీల్లో భార్యభర్తలు ఇద్దరూ ఉద్యోగులు అయితే బదిలీల్లో వారికి కొంత వెసులుబాటును ఇస్తుంటారు. ఒక్కసారి స్పౌజ్ కోటాను వాడి బదిలీ నుంచి రక్షణ పొందితే మళ్లీ 8 ఏళ్ల వాడకూడదు. తప్పనిసరి అయితే భార్యభర్తలు ఇద్దరినీ మరో ప్రాంతానికి బదిలీ చేయాలి. ఇదీ నిబంధన. అయితే తిరుపతి కేంద్రంగా ప్రస్తుతం ఈఈలుగా పనిచేస్తున్న భార్యభర్తలు ఇద్దరూ ఈ స్పౌజ్ కోటాను దుర్వినియోగం చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. 30 ఏళ్లుగా స్పౌజ్ కోటాను వారు అస్త్రంలా వాడుతూనే ఉన్నారు. మరోసారి ఈ అస్త్రంతోనే తిరుపతిలోనే తిష్టవేయాలని ప్రయత్నిస్తున్నారు.

చక్రం తిప్పుతున్న ఒకరోజు ఎస్‌ఈ!

ప్రస్తుత విద్యుత్ ఉద్యోగుల బదిలీల్లో ఒక రోజు ఎస్‌గా దొడ్డిదారిలో పదోన్నతి పొందిన అధికారి కీలకపాత్ర పోషిస్తున్నారు. తిరుపతిలో ఈఈ గా పనిచేసి రిటైర్డ్ అవడానికి ఒక రోజు ముందు సూపరింటెండెంట్ ఇంజనీరుగా పదోన్నతి పొందింది, ఒక రోజు ఎస్‌ఈగా పేరు సంపాదించిన తిరుపతికి చెందిన విశ్రాంత ఉద్యోగి ప్రస్తుత బదిలీల్లో చక్రం తిప్పుతున్నాడు. సామాజిక వర్గాన్ని ఎరగా వేసి తిరుపతి ఎమ్మెల్యేకు చేరువైన ఇతను తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాలతో పాటు తిరుపతి సర్కిల్ పరిధిలో జరుగుతున్న బదిలీల్లో తలదూర్చుతున్నాడనే విమర్శలు ఉన్నాయి.

నిబంధనల మేరకు బదిలీలు

ప్రభుత్వ నిబంధనల మేరకే బదిలీల ప్రక్రియను పూర్తి చేస్తాం. ఐదేళ్లు ఒకే ప్రాంతంలో పనిచేసిన వారిని తప్పనిసరిగా బదిలీ చేస్తాం. ఈ విషయంలో మాకు ఎలాంటి ఒత్తిళ్లు లేవు. అందరికీ ఒక రకమైన నియమ నిబంధనలు వర్తిస్తాయి. అందులో ఎలాంటి సందేహం లేదు.

– సంతోషరావు, సీఎండీ, ఎస్పీడీసీఎల్, తిరుపతి

మాకొద్దు ఈ సర్కార్ భోజనం



ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం తింటున్న విద్యార్థులు



హోటళ్ల నుంచి పార్శల్ తెచ్చుకుని తింటున్న విద్యార్థులు

- నీళ్ల సాంబారు, గంజికట్టిన అన్నం
- చెడిపోయిన కోడిగుడ్లు
- ఇంటి నుంచి తెచ్చుకుంటున్న 50 శాతం మంది పిల్లలు

తిరుపతి అర్బన్ : ఈ సర్కారోళ్లు ఇచ్చే పాఠశాల భోజనం మాకొద్దు బాబోయ్ అని విద్యార్థులు అంటున్నారు. ఇంటి నుంచి క్యారేజ్ తెచ్చుకుని మధ్యాహ్నం భోజనం చేస్తున్నారు. తిరుపతి నగరం బైరాగిపట్టెడలోని ఎంజీఎం ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని గురువారం సాక్షి బృందం పరిశీలించింది. పాఠశాలలో 3 నుంచి 10వ తరగతి వరకు 730 మంది ఉండగా 50 శాతం మంది ఇంటి నుంచే భోజనం తెచ్చుకుంటున్నారు. 10 శాతం మంది పిల్లలు హోటళ్ల నుంచి భోజనం తెప్పించుకుంటున్నారు. మరో 10 శాతం పిల్లలకు వారి తల్లి లేదా తండ్రి ఇంటి నుంచి క్యారేజ్ తెచ్చి ఇచ్చేసి వెళుతున్నారు. ఇంటి నుంచి క్యారేజీలు తెచ్చుకునే అవకాశం లేని 30 శాతం మంది మాత్రమే పాఠశాలలో తింటున్నారు. ప్రభుత్వం తిరుపతిలోని అన్ని పాఠశాలలకు ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో భోజనం అందిస్తోంది. కోడిగుడ్లు మాత్రం ఆయా పాఠశాలల్లోనే ఉడకబెట్టి ఇస్తున్నారు. పలు కోడిగుడ్లు చెడిపోవడంతో పిల్లలు పారేస్తున్నారు. అన్నం గంజి కట్టి ఉందని, నీళ్ల సాంబారు పెడుతున్నారని విద్యార్థులు వాపోయారు. తిరుపతి నగరంలోని సర్కార్ బడుల్లోనే కాదు జిల్లా వ్యాప్తంగాను మధ్యాహ్న భోజనం తూతూమంత్రంగానే సాగుతుంది. ప్రధానంగా వంట నిర్వాహకులకు ప్రభుత్వం సక్రమంగా జీతాలతో పాటు మెస్ బిల్లులు కూడా ఇవ్వడం లేదు. దీంతో అప్పులు చేసి భోజనం తయారు చేయడం కష్టంగా ఉందని నిర్వాహకులు చెబుతున్నారు. అందువల్లే మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టలేకపోతున్నామని పేర్కొంటున్నారు. గత ప్రభుత్వం పాఠశాలల రూపురేఖలను మార్చి విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందిస్తే, ఈ ప్రభుత్వం పాఠశాలలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పలువురు మండిపడుతున్నారు. విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు మధ్యాహ్న భోజనంపై తీవ్రమైన అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



ఇంటి నుంచి తెచ్చి తమ పిల్లలకు భోజనం పెడుతున్న తల్లి





అధ్వానంగా ఉన్న ప్రభుత్వ భోజనం చూపుతున్న విద్యార్థులు

వ్యాయామం.. దినచర్యలో భాగం



ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి ఎడ్యుకేషన్: ప్రతి విద్యార్థికి వ్యాయామం దినచర్యలో భాగం కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని డీఎస్‌ఏ, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ నుంచి మహతి కళాక్షేత్రం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మేజర్ ధ్యాన్‌చంద్ గొప్ప హాకీ క్రీడాకారుడని తెలిపారు. అందుకే ధ్యాన్‌చంద్ జయంతిని జాతీయ క్రీడా దినోత్సవంగా భారత ప్రభుత్వం నిర్వహిస్తోందని తెలిపారు. అనంతరం ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ర్యాలీని ప్రారంభించారు. నేషనల్ గేమ్స్‌లో బంగారు పతకాన్ని సాధించిన బ్యాడ్మింటన్ క్రీడాకారిణి దండు పూజను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సయ్యద్ సాహెబ్, డీఈఓ డాక్టర్ వి.శేఖర్, జిల్లా ఒలింపిక్స్ సంఘం అధ్యక్షుడు ప్రవీణ్, ప్రొఫెసర్ శివశంకర్‌రెడ్డి, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి సయ్యద్ సాహెబ్, జిల్లా విద్యా శాఖ అధికారి శేఖర్, జిల్లా ఒలింపిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రవీణ్, ఎస్వీయూ పీడీ ప్రొఫెసర్ శివశంకర్ రెడ్డి, ఎస్వీ వెటర్నరీ పీడీ జయచంద్ర, క్రీడాకారులు, ఎన్‌సీసీ అధికారులు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



తిరుపతి బులియన్
బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.74,070
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.6,709
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.87,600
రిటైల్ వెండి గ్రాము రూ.90.60

భద్రత అంతంత మాత్రమే



ప్రభుత్వ ఆసుపత్రులలో భద్రత అంతంత మాత్రంగానే ఉంది. ఆసుపత్రి ప్రాంగణంలో అసాంఘిక శక్తులు చొరబడకుండా పటిష్టమైన భద్రత అవసరం. సాయంత్రం వేళల్లో పోలీసులు గస్తీ నిర్వహించాలి. వాహనాలు అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయకుండా చొరవ తీసుకోవాలి. వైద్య విద్యార్థినులు హాస్టల్కు వెళ్లే మార్గంలో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలి, సెక్యూరిటీ సిబ్బంది ఉండేలా వెంటనే చర్యలు చేపట్టాలి.

– డాక్టర్ పి.రెడ్డెప్ప, ఐఎంఏ ఉపాధ్యక్షులు, తిరుపతి



ఆందోళన తీవ్రం



దేశంలో వైద్య విద్యార్థినులపై జరుగుతున్న అఘాయిత్యాలు చూస్తుంటే తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. బిడ్డలను బయటకు పంపించాలంటే తల్లిదండ్రులు ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. సమాజంలో మార్పుతోపాటు కఠినమైన చట్టాలు రావాలి. అత్యాచారాలకు పాల్పడే దుర్మార్గులను తీవ్రంగా శిక్షించాలి. అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి.

– కె. స్వర్ణలేఖ, వైద్యురాలి తల్లి

క్లుప్తంగా

శ్రీవారి బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాలను అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి చెప్పారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఆయన గురువారం సాయంత్రం బ్రహ్మోత్సవాల భద్రత ఏర్పాట్లపై సీవీఎస్‌వో శ్రీధర్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడితో సమీక్ష నిర్వహించారు. అక్టోబరు 4 నుంచి 12వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు టీటీడీ, పోలీసు, సంబంధిత విభాగాల అధికారులంతా సమన్వయంతో పని చేయాలని చెప్పారు. ముందుగా టీటీడీ సీవీఎస్‌వో నాలుగు మాడ వీధుల్లోని గ్యాలరీలు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, ఎదురయ్యే సవాళ్లు, అధిగమించేందుకు తీసుకోవలసిన చర్యలు, పార్కింగ్ స్థలాలు, రోప్ పార్టీలు, సంబంధిత సమస్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను అందించారు. అనంతరం తిరుపతి ఎస్పీ చేపట్టనున్న భద్రతా చర్యలను వివరించారు. ఈ సమావేశంలో టీటీడీ విజిలెన్స్, సెక్యూరిటీ, జిల్లా పోలీసు ఉన్నతాధికారులు, టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

ఎస్వీయూ పీజీ ఫలితాలు విడుదల

తిరుపతి సిటీ: నగరంలోని శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ పరిధిలో ఈ ఏడాది జూలైలో జరిగిన పోస్టు గ్రాడ్యుయేషన్ (పీజీ) ఎంఏ, ఎమ్మెస్సీ 4వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను గురువారం విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ దామ్లానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాల కోసం విద్యార్థులు వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

భక్తులకు లడ్డూ పోటు





ఆధార్ కార్డులతో లడ్డూ క్యూలో ఉన్న భక్తులు, ఆలయం ముందు భక్తుడి చేతిలో లడ్డూ

తిరుమల: కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక తిరుమలలో కీలక మార్పులకు శ్రీకారం చుట్టింది. శ్రీవారి భక్తులకు లడ్డూ ప్రసాదాన్ని పరిమితం చేసింది. మొన్నటివరకు భక్తులు అడిగినన్ని లడ్డూలు అందించిన టీటీడీ ఇప్పుడు కోత పెట్టింది. కూటమి ప్రభుత్వం పాలనలో తనదైన మార్కు చూపించుకోవడానికి భక్తులను ఇబ్బంది పెడుతోంది. ఎక్కడెక్కడో దేశ నలుమూలల నుంచి వచ్చిన శ్రీవారి భక్తులు అదనపు లడ్డూ కోసం అవస్థలు పడాల్సి వస్తోంది. దర్శనానంతరం భక్తులు ఆధార్ కార్డు చూపిస్తేనే అదనపు లడ్డూ అంటూ టీటీడీ షరతు పెట్టింది. అయితే ఆధార్ చూపించినప్పటికీ అదనపు లడ్డూ మాత్రం ఇవ్వకపోవడం భక్తుల్లో అసంతృప్తిని రగిల్చింది. దీంతో భక్తులు అదనపు లడ్డూ కోసం ప్రయత్నించి అవమానాలు ఎదుర్కోవాల్సి వచ్చింది. అయితే సామాన్య భక్తులకు అందుతున్న లడ్డూ, వడ ప్రసాదాన్ని దూరం చేసేందుకు టీటీడీ కసరత్తు చేస్తోందన్న చర్చ మొదలైంది.

ఆధార్ కార్డు ఉంటేనే..



నేను సర్వదర్శనానికి వెళ్లి వచ్చాను. ఆధార్ కార్డు ఉంటేనే అదనపు లడ్డూలు ఇస్తామని లడ్డూ కౌంటర్‌లో చెప్పారు. దీనికి నేను ఆధార్ కార్డు చూపించాను. అయినా 2 లడ్డూలు మాత్రమే అదనంగా ఇస్తామని అంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్ని లడ్డూలు కావాలన్నా ఇచ్చేవారు.

– అరవింద్ రెడ్డి, తెలంగాణ

లడ్డూ కోసం నిరీక్షణ



శ్రీవారి దర్శనం కోసం వేచి ఉన్నంతసేపు.. లడ్డూ కౌంటర్‌లో కూడా వేచి ఉండాల్సి వస్తోంది. 30 నిమిషాల పాటు లడ్డూ క్యూలో నిలబడ్డాను. కౌంటర్ ముందుకు వెళ్లేసరికి ఆధార్ కార్డు తప్పనిసరిగా కావాలని అన్నారు.

– సత్యనారాయణ, కాకినాడ

సమాధానం చెప్పలేదు



ఆధార్ లేకుంటే ఎందుకు ఇవ్వరు అని అడిగితే కౌంటర్‌లలో ఎలాంటి సమాధానం లేదు. ఆధార్ ఉంటేనే రెండు అదనపు లడ్డూలను ఇస్తామని కౌంటర్‌లో సిబ్బంది చెబుతున్నారు. మా ప్రశ్నకు సమాధానం ఇచ్చేవాళ్లు లేరు. టీటీడీలో ఎంత దౌర్భాగ్యంగా ఉందని అనిపించింది.

– సంజీవరావు, విశాఖపట్నం

రెండే ఇచ్చారు



స్వామి వారి ప్రసాదాలు అందరికీ అందుబాటులో ఉండాలి. దర్శనం టికెట్ల ద్వారా రెండు లడ్డూలను మాత్రమే ఇచ్చారు. లడ్డూ కౌంటర్లలో నిరీక్షించినా అదనపు లడ్డూలు మాత్రం ఇవ్వలేదు.

– సురేష్, ఖమ్మం

చాలా బాధాకరం



ఆధార్ కార్డు ఉంటేనే లడ్డూల వితరణ అనేది చాలా బాధాకరం. అదీ రెండు లడ్డూలు మాత్రమే . ప్రతి భక్తుడికీ అవసరమైన లడ్డూలు అందించాల్సిన బాధ్యత టీటీడీదే. ఎలాంటి ఆంక్షలు లేకుండా లడ్డూలు అందించాలి.

– ఉషా, విశాఖపట్నం

గతంలో లాగే ఇవ్వాలి



ఆధార్ కార్డుతో లడ్డూలు తక్కువ ధరకు అందించాలా వద్దా అనేది టీటీడీ ఇష్టం. కానీ డబ్బులు ఇచ్చే ప్రతి భక్తుడికి అడిగినన్ని లడ్డూలు అందించేలా ఉండాలి. గతంలో ఇచ్చినట్లు ఇప్పుడు అందిస్తే చాలా మంచిది. ఈ నిర్ణయంపై టీటీడీ మరోసారి ఆలోచించాలి.

– సత్యనారాయణ, అమలాపురం

అదనపు లడ్డు ఇవ్వలేదు



దర్శనం అనంతరం ఉచిత లడ్డూలతో కలిపి మూడు లడ్డూలను మాత్రమే ఇచ్చారు. అదనంగా లడ్డూ కావాలని అడిగితే లేదన్నారు. గతంలో ఇచ్చిన విధంగా విరివిగా లడ్డూలను అందించాలి. ఆధార్ కార్డు చూపిస్తే కూడా కౌంటర్‌లో సిబ్బంది స్పందించలేదు. ఇదేమి విడ్డూరమో ఏమో.

– శ్రీనివాసులు, మండపేట

బస్సు బోల్తా : ఏడుగురికి గాయాలు



బస్సు బోల్తా పడడంతో అద్దాలు పగుల గొట్టి ప్రయాణికులను బయటకు తీస్తున్న స్థానికులు

చిల్లకూరు : ముత్తుకూరు నుంచి కోటకు వెళుతున్న ఆర్టీసీ బస్సు అదుపు తప్పి బోల్తా పడడంతో ఏడుగురికి గాయాలైన సంఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వాకాడు డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సు సర్వేపల్లి నియోజకవర్గంలోని ముత్తుకూరుకు వెళ్లి తిరిగి ప్రయాణికులను ఎక్కించుకుని కోటకు బయల్దేరింది. సింగిల్ రోడ్డు కావడంతో మోమిడి వద్దకు రాగానే బస్సు అదుపుతప్పి పొలాల్లోకి పక్కకు ఒరిగి పోయింది. ఈ బస్సులో మొత్తం 37 మంది ప్రయాణికులు ఉండగా, డ్రైవర్ సురేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కండక్టర్ సుప్రజ షాక్‌కు గురై నిశ్చలస్థితిలో ఉండిపోయింది. బస్సులో ప్రయాణిస్తున్న గమ్మళ్ళదిబ్బకు చెందిన హసీనాబీ, ముంతాజ్, లింగవరానికి చెందిన ప్రవళిక, కొమరావారిపాళెంకు చెందిన అంకమ్మ, తమ్మినపట్నంకు చెందిన వెంకటమ్మ, వరగలికి చెందిన నిఖిత, వాకాడు మండలం సింగనాలత్తూరుకు చెందిన చిన్నమ్మకు గాయాలయ్యాయి. వీరిలో అంకమ్మ, చిన్నమ్మలకు తీవ్రగాయాలు కావడంతో వారిని నెల్లూరుకు తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే సమాచారం అందుకున్న మోమిడికి చెందిన ఆయుర్వేద వైద్యశాల వైద్యులు కలపాటి శేఖర్ సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు చికిత్స అందించారు. అనంతరం జిందాల్ పవర్ పరిశ్రమకు చెందిన అంబులెన్స్‌లో వరగలి పీహెచ్‌సీకీ తరలించి మెరుగైన వైద్యం అందించారు. ప్రమాదం విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించడంతో పాటుగా ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేసి బస్సును పైకి లేపేందుకు చర్యలు చేపట్టారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కష్టపడితేనే రాణిస్తారు



కేంద్ర ప్రభుత్వ డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పొన్నారావును సన్మానిస్తున్న న్యాయవాదులు

తిరుపతి లీగల్ : యువ న్యాయవాదులు కష్టపడితేనే వృత్తిలో రాణించగలరని రాష్ట్ర హైకోర్టులో కేంద్ర ప్రభుత్వ డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పసల పొన్నారావు తెలిపారు. తిరుపతి న్యాయవాద సంఘం, రాష్ట్ర న్యాయవాద పరిషత్, ఎస్సీ,ఎస్టీ న్యాయవాదుల అసోసియేషన్ల ఆధ్వర్యంలో గురువారం తిరుపతి కోర్టు ఆవరణలోని న్యాయవాదుల గ్రంథాలయం సమీపంలో పొన్నారావును న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ తాను తిరుపతి జిల్లావాసి కావడం తన పూర్వజన్మ సుకృతం అన్నారు. యువ న్యాయవాదులు కొత్తగా వస్తున్న చట్టాలను అప్పటికప్పుడు చదువుతూ సీనియర్లు చూపిన బాటలో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గోపీచంద్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు గల్లా సుదర్శన్ రావు, రాష్ట్ర న్యాయవాద పరిషత్ కార్యవర్గ సభ్యుడు, సీనియర్ న్యాయవాది ఎం నాగరాజు, ఎస్సీ ఎస్టీ న్యాయవాదుల అసోసియేషన్ అధ్యక్షుడు ఊటుపల్లి లక్ష్మన్న సీనియర్ న్యాయవాది కొత్తపల్లి అజయ్ కుమార్ తదితరులు పొన్నారావు సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి న్యాయవాదుల సంఘం కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర న్యాయవాద పరిషత్ ప్రధాన కార్యదర్శి వజ్రాల చంద్రశేఖర్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం



క్రీడాకారులతో డీఈఓశేఖర్, డీఎస్ఓ తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్ : క్రీడలతో శారీరక, మానసికోల్లాసం కలుగుతుందని తిరుపతి డీఈఓ డాక్టర్ వి.శేఖర్ తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని డీఎస్ఏ, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా జిల్లాలోని పలు పాఠశాలల్లో నిర్వహించిన క్రీడా సంబరాలు గురువారంతో ముగిశాయి. తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఏర్పాటుచేసిన ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా డీఈఓ హాజరై మాట్లాడారు. క్రీడల ద్వారా మంచి ఆరోగ్యంతో పాటు పై చదువులకు, కొలువులు సాధనకు దోహదపడతాయని తెలిపారు. అనంతరం ఆయా పోటీల్లో విజేతలకు ట్రోఫీలు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఓ సయ్యద్‌సాహెబ్, డీవైఈఓ బాలాజీ, ఎస్‌జీఎఫ్ అండర్-19, 17, 14 కార్యదర్శులు జయరామయ్య, బాబు, ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రవీణ్, శ్రీధర్, డీఎస్ఏ కోచ్‌లు చక్రవర్తి, వినోద్, ఎజాజ్, గోపి, నీలిమ, సాయిసుమతి, మాలిని, ప్రేమ్, పీడీ, పీఈటీ, క్రీడాకారులు పాల్గొన్నారు.

1 నుంచి పశుగణన

తిరుపతి అర్బన్: జిల్లాలో పశువులు ఎన్ని ఉన్నాయో స్పష్టంగా తెలియజేయడానికి సెప్టెంబర్ 1వ తేదీ నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు మూడు నెలలపాటు పశుగణన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి రవికుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 21వ జాతీయ పశుగణనలో భాగంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. ప్రతి ఐదేళ్లకోసారి పశుగణన ఉంటుందని స్పష్టం చేశారు. దీనికోసం ఈ నెల 6వ తేది నుంచి 13వ తేదీ వరకు 472 మంది ఎన్యుమరేటర్లు, 77 మంది సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. గడువులోపు గణన ప్రక్రియ పూర్తి చేయాలని చెప్పారు.

పేట గురుకులం ఖాళీ

- 20 మందికి పైగా వెళ్లి పోయిన విద్యార్థులు
- అస్వస్థతకు గురైన విద్యార్థులు ఇళ్లకు పంపివేత



గురుకులం వద్దకు వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకులం ఖాళీ అయిపోతోంది. గత నెల కలుషిత ఆహారం తిని 150 మంది వరకు విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆ ఘటన నుంచి పూర్తిగా కోలుకోక ముందే మరోసారి కలుషిత ఆహారం కారణంగా 15 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వీరికి చికిత్సలు చేసి తల్లిదండ్రులను పిలిపించి ఇళ్లకు పంపించేశారు. ఎల్ఏ సాగరం అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ సుబ్బారావు గురుకులం వద్ద రెండు రోజులుగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య సేవలందిస్తున్నారు. ఈ వరుస ఘటనలతో బెంబేలెత్తిపోయిన తల్లిదండ్రులు నెల రోజుల్లోనే 20 మందికి పైగా విద్యార్థుల టీసీలను తీసుకుని గురుకులం నుంచి వెళ్లిపోయినట్లు తెలిసింది.

ఆలస్యంగా స్పందించిన అధికారులు

గురుకులం ఖాళీ అయిపోతున్న సమాచారం అందుకున్న అధికారులు ఆలస్యంగా స్పందించారు. గురుకులంలో ఆహార పానీయాల ఏర్పాట్లను గురువారం పరిశీలించారు. విద్యార్థులకు అందించే ఆహారం, తాగేందుకు మినరల్ వాటర్‌ను సైతం అందుబాటులోకి తెచ్చారు. ప్రిన్సిపల్ దాదాఫీర్ మాట్లాడుతూ గురుకులంలో రూ.56 లక్షల నిధులతో పూర్తి స్థాయి వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి విద్యార్థులకు ఆర్ఓ ప్లాంటునీరు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని వివరించారు. ఈ గురుకులాన్ని జిల్లా అధికారులు పరిశీలించి, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. వీరిలో డీపీఎంఓ శ్రీనివాసులు, హిదయతుల్లా, మలేరియా సబ్ యూనిట్ అధికారి చిన్నయ్య, ఏఎన్ఎం ఉన్నారు.

రోగి అదృశ్యంపై కేసు నమోదు

తిరుపతి తుడా: స్విమ్స్ అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్న రోగి అదృశ్యమవడంతో తిరుపతి వెస్ట్ పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదయింది. ఈ మేరకు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం బురవమాకుల పల్లెకు చెందిన సీతారామప్పను 27వ తేదీన స్విమ్స్ కు తీసుకువచ్చారు. ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించగా ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నట్లు నిర్ధారించారు. వెంటనే అత్యవసర విభాగంలో చేర్చాలని వైద్యులు సూచించారు. శ్రీ పద్మావతి ఆస్పత్రిలోని ఎంఐసీయూ వార్డులో చేర్చి ప్రథమ చికిత్స అందించారు. ఈ క్రమంలో ఆయన అర్ధరాత్రి నుంచి కనిపించకుండా పోయారు. ఆయన కుమారుడు విశ్వనాథ్ స్విమ్స్ పరిసర ప్రాంతాల్లో ఎంత వెతికినా కనిపించలేదు. ఎంఐసీయూలో ఉన్న రోగి అదృశ్యం అయినా సెక్యూరిటీ సిబ్బంది గానీ, అధికారులు గానీ సరైన పద్ధతిలో స్పందించలేదని రోగి బంధువులు ఆరోపించారు. దీంతో రోగి బంధువులు, అధికారులు వెస్ట్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.